## క్లుప్తంగా

### తప్పల్లేకుండా ఓటర్ల జాబితా



మాట్లాడుతున్న తహసీల్దార్ రాజేంద్ర

నాయుడుపేటటౌన్: ఓటర్ల జాబితాలను తప్పులు లేకుండా పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ మాగర్ల రాజేంద్ర సూచించారు. రెవెన్యూ కార్యాలయంలో బుధవారం వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులకు ఓటర్ల జాబితా నిర్వహణ, కొత్తగా ఓటు హక్కు నమోదు తదితర అంశాలపై సాయంత్రం వరకు శిక్షణ ఇచ్చారు. ఓటర్ల జాబితాలలో ఒకే పేరుతో పలు చోట్ల ఓటు నమోదై ఉండడాన్ని గుర్తించి వారికి నోటీసులు జారీ చేయాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా సారథ్యంలో బీఎల్ఓలకు ఓటు హక్కు నమోదు, జాబితా పరిశీలన తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

### పంచాయతీ పురోగతిపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ

సైదాపురం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ రవీంద్ర బాబు అధ్యక్షతన పంచాయతీల పురోగతిపై సూచికపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను 2030 నాటికి సాధించాలనే లక్ష్యంతో వాటి ప్రగతిని అంచనా వేయడానికి పంచాయతీ పురోగతి సూచీని రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోలయ్య, ఏఓ మురళి తదితరులున్నారు.

### ఆవాజ్ నూతన కమిటీ



ఎన్నికైన ఆవాజ్ కమిటీ నాయకులు

నాయుడుపేటటౌన్ : సీఐటీయూ అనుబంధ సంస్థగా ఉన్న ముస్లింలకు సంబంధించిన ఆవాజ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నట్లు ఆ సంఘం నాయకులు బుధవారం ప్రకటించారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆవాజ్ మైనారిటీ డెవలప్ మెంట్ ఫోరం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ రఫీద్ సారథ్యంలో నాయుడుపేట మండల కమిటీని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఆవాజ్ కమిటీ అధ్యక్షులుగా పఠాన్ హలీంఖాన్, ఉపాధ్యక్షులుగా షేక్ అన్సర్, షేక్ ఉస్మాన్, కార్యదర్శిగా షేక్ ఖాదర్, సహాయ కార్యదర్శులుగా షేక్ కాలేషా, షేక్ అబ్దుల్లా, ట్రెజరర్‌గా షేక్ ఇలియాజ్ ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ప్రకటించారు. నూతనంగా ఎన్నికైనా ఆవాజ్ కమిటీ ముస్లింల సంక్షేమానికి పాటు పడుతామని స్పష్టం చేశారు.

### సమస్యలు పరిష్కరించాలి




మాట్లాడుతున్న ఎంపీడీఓ దిలీప్‌కుమార్

కోట: మండలంలో ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ దాసరి అంజమ్మ అధికారులను ఆదేశించారు. పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు గైర్హాజరయ్యారు. సమావేశానికి హాజరైన అధికారులు తమ శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. కోట మేజర్ పంచాయతీలో చెత్త తరలించడం కష్టంగా ఉందని, పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని ఎంపీటీసీలు కోరారు. నెల్లూరుపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో చెరువుల తూములు దెబ్బతిన్న చోట వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ జయజయరావు, జెడ్పీటీసీ కోటయ్య, వైస్ ఎంపీపీ శేషయ్య, ఎస్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు వైద్యపరీక్షలు

వెంకటగిరి రూరల్: మండలంలోని మన్నేగుంట ప్రాథమిక పాఠశాలలో చెలికంపాడు సచివాలయానికి చెందిన ఎంఎల్‌హెచ్‌పీ పూర్ణిమ, ఆశావర్కర్లు నాగమణి బుధవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అప్పిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.





సైదాపురం: ర్యాలీ చేస్తున్న కార్మికులు



నాయుడు పేట: కార్మికుల మానవహారం

# కదం తొక్కిన కార్మికులు

సూళ్లూరుపేట : వామపక్షాల పిలుపు మేరకు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం మండలాల్లో కార్మికులు ఆందోళన బాట పట్టారు. ర్యాలీలు, మానవహారాలు, ధర్నాలు చేశారు. పట్టణంలో ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా నాయకులు శ్రీరాములు, వందవాసి నాగరాజు ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక సీపీఐ, సీపీఎం కార్యాలయాల నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మేకల హైమావతి, నియోజకవర్గ ఏఐటీయూసీ అధ్యక్షులు రమణయ్య, గౌరవాధ్యక్షులు శ్రీనివాసులు, సీఐటీయూ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, పద్మనాభయ్య, నాయకులు సుంకర అల్లెయ్య, మునెయ్య, బాలు, నాగరాజు బాబు, అహ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటటౌన్ : నాయుడుపేట పట్టణంలో ప్రభుత్వాల తీరును నిరసిస్తూ సీఐటీయూ కార్యాలయం నుంచి పాత బస్టాండు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా నాయకురాలు లక్ష్మి, స్థానిక మహిళ నాయకులు ఎస్ శ్యామల, మహేష్ బాబు, ముకుందా పాల్గొన్నారు.

కోట: మండలంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. తహసీల్దార్ జయజయరావుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు విజయలక్ష్మీ, పద్మలీల పాల్గొన్నారు.

సైదాపురం: మండల కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు డీపీ పోలయ్య ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో నాయకులు చెంగల్రావు, నవకోటి, శ్రీనివాసులు, వెంకటరమణయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాపూరు: మండలానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు అంగన్‌వాడీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి, తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. యూనియన్ అధ్యక్షురాలు జయసుధ, సీఐటీయూ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

డక్కిలి: మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగనవాడీ వర్కర్స్, ఆయాలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు తులసి, సుకన్య, ప్రసన్న, లీలా, వెంకటమ్మ సుగుణ పాల్గొన్నారు.

వాకాడు : మండలంలోని అంగనవాడీ ఉద్యోగులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు.

కలువాయి(సైదాపురం): స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశావర్కర్లు నిరసన తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మి, ఓబులేసు, అల్లంపాటి లక్ష్మి, సౌజన్యమ్మ పాల్గొన్నారు.

గూడూరు రూరల్ : పట్టణంలో సీఐటీయూ నాయకులు భారీ ర్యాలీ చేసి, టవర్‌క్లాక్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, పుల్లయ్య, ప్రభాకర్, శికుమార్, నారాయణ, జోగి శివ కుమార్, బి.వి.రమణయ్య పాల్గొన్నారు.

### స.హ.చట్టంపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న మేనేజర్ ఊరుకుందమ్మ

నాయుడుపేటటౌన్ : సమాచార హక్కు చట్టంపై బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, మున్సిపల్ మేనేజర్ ఊరుకుందమ్మ మాట్లాడుతూ, చట్టం ద్వారా అన్ని శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులు, వాటికి నిధుల వినియోగం తదితర విషయాలను తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టం ద్వారా కోరవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది లోకేశ్వరి, దయాసాగర్, కిషోర్ పాల్గొన్నారు.



## వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

సూళ్లూరుపేట రూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మండల పార్టీ కమిటీలను ప్రకటించింది. ఈ కమిటీలో ఇద్దరు మండల ఉపాధ్యక్షులు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, ఒక కోశాధికారి తోపాటు ఐదుగురు కార్యదర్శులను 15 మంది సభ్యులను నియమించింది.

సూళ్లూరుపేట పట్టణ కమిటీ ఉపాధ్యక్షులుగా చిన్ని సత్యనారాయణ, సన్నారెడ్డి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా కె. భగవాన్‌రావు, వంక చంద్రయ్య, పాల మురళి, కోశాధికారిగా సీహెచ్ బాలకృష్ణను నియమించారు.

సూళ్లూరు పేట మండల ఉపాధ్యక్షులుగా చింతగింజల వెంకటేశ్వర్లు, వాకాటి బాబురెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా వజ్జ చంద్రశేఖర్‌రెడ్డి, ఉగ్గుముడి మణి, దాశరి ధనంజయలు, కోశాధికారిగా కల్లిపుడి సుధాకర్‌రెడ్డిని ఎంపిక చేశారు.

ఓజిలి: మండల కమిటీ ఉపాధ్యక్షులుగా బొందల చిన్నముమ్మయ్య, బెల్లం సుబ్బానాయుడు, ప్రధాన కార్యదర్శులుగా కాకాణి రవి, ఇనుగుంట శివ ప్రసాద్, యల్లంరాజు రాంప్రసాద్‌రాజు, కోశాధికారిగా పరంగి ప్రసాద్‌ను ప్రకటించారు.

పెళ్లకూరు: మండల ఉపాధ్యక్షులుగా చుట్టు గురువయ్య, పగడాల హరిబాబురెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా వెంపల్లి సత్యంరాజు, అన్నాగి చంద్రయ్య, పసల పోలయ్య, కోశాధికారిగా నెలబల్లి గురవయ్యను ప్రకటించారు.

దొరవారిసత్రం: మండల కమిటీ ఉపాధ్యక్షులుగా దువ్వూరు శ్రీనివాసులరెడ్డి, అరని సురేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా సన్నారెడ్డి కృష్ణారెడ్డి, నూతలపాటి రాధకృష్ణనాయుడు, షేక్ జాకీర్, కోశాధికారిగా కామిరెడ్డి సుబ్బారెడ్డి నియమితులయ్యారు.

నాయుడుపేటటౌన్ : మండల కమిటీ ఉపాధ్యక్షులుగా ఆకుతోట సుబ్బారెడ్డి, వాకాటి సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా పిలాస మణి, ఎద్దల మునిహర్‌రెడ్డి, బత్తిన రమణయ్య, కోశాధికారిగా సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డిని ఎంపిక చేశారు.

నాయుడుపేట పట్టణ కమిటీ ఉపాధ్యక్షులుగా కొండూరు రామకృష్ణమ్మరాజు, బైనా మల్లికార్జునరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా దొంతాల రాజశేఖర్‌రెడ్డి, కావేరిపాకం భానుప్రసాద్, పేర్నాటి రాహుల్, కోశాధికారిగా అన్నమనేని రామకృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవం ప్రారంభం

సైదాపురం: మండలంలోని కలిచేడు సమీపంలో వెలసిన శ్రీకామాక్షిదేవి సమేత శ్రీసిద్ధేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవదాయశాఖ కార్యనిర్వాహకులు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ వరకు ఏడు రోజుల పాటు ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు మంగళవారం రాత్రి అంకురార్పణ నిర్వహించినట్లు పేర్కొన్నారు. బుధవారం ధ్వజారోహణం, గురువా రం నందిసేవ, శుక్రవారం ఉద యం గజవాహన సేవ అనంతరం కల్యాణోత్సవం ఉంటుందని చెప్పారు.

### కండలేరులో 31.175 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 31.175 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2060, పిన్నేరుకాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 70, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ తెలిపారు.

### ఈకేవైసీ తప్పనిసరి

రాపూరు: అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన రైతులు ఈకేవైసీ చేయించోవాలని వ్యవసాయాధికారి సోమసుందర్ తెలిపారు. మండలంలోని సంక్రాంతిపల్లి, కంబాలపల్లిలో బుధవారం పొలంపిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు పలు పంటల సాగుపై సూచనలు ఇచ్చారు.

### బహిరంగంగా మద్యం తాగితే చర్యలు

కలువాయి(సైదాపురం) : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవని ఎస్ఐ కోటయ్య తెలిపారు. ఆయన బుధవారం పలు కూల్‌డ్రింక్ షాపు, బస్టాండ్ ప్రాంతాలను సిబ్బందితో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దేవాలయాలు, స్కూళ్ల మరియు పబ్లిక్ ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి వంటి మత్తుకు బానిస కావద్దని ఆయన తెలిపారు.

### శుభ్రత పాటించాలి

కోట: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా సంక్షేమ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ సూచించారు. కోటలోని ఎస్సీ బాలుర గురుకుల విద్యార్థులకు బుధవారం పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### అధికారుల డుమ్మా

కలువాయి(సైదాపురం): కలువాయి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ పురోగతి సూచిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి తహసీల్దార్, వెలుగు ఏపీఎం, మెడికల్ ఆఫీసర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, సీడీపీఓ, స్టేషన్ హౌస్ అధికా రులు పశుసంవర్ధకశాఖ ఏడీ డుమ్మా కొట్టారు. మండల విద్యాశాఖ అధికారి హౌసింగ్ ఏఈలు ఇలా వచ్చి అలా సంతకం పెట్టి వెళ్లిపోయారు. కేవలం డిప్యూటీ ఎంపీడీఓ రమేష్, అగ్రికల్చర్ అధికారి కళారాణి, ఆర్ ఐతోపాటు కొంతమంది మాత్రమే పాల్గొన్నారు.

## వైభవంగా గురుపూర్ణిమ వేడుకలు





నాయుడుపేట: ప్రత్యేక అలంకరణల్లో సాయిబాబా , అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపూర్ణిమ ఉత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. బాబాకు అభిషేక పూజలు జరిపి బుధవారం నూతన వస్త్రాలతో పాటు ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి బాబాకు ప్రత్యేక పల్లకీ సేవ నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కోటూరు సాయిరామ్ ప్రసాద్, ఉభయదాతల తోపాటు సాయి సేవాదళ్ సభ్యులు, భక్త బృందం పాల్గొంది. పట్టణంలోని అగ్రహారపేటలో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపూర్ణిమ ఉత్సవాలను బుధవారం ప్రారంభించారు.

**వైభవంగా సాయిబాబా గ్రామోత్సవం**

సైదాపురం: మండల కేంద్రంలోని శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా బుధవారం నుంచి వేడుకలు ప్రారంభమయ్యాయి. సాయి నామస్మరణతో నగర సంకీర్తనలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించి వైభవంగా గ్రామోత్సవం స్వామివారికి వేదమంత్రోచ్ఛరణల నడుమ అభిషేకం చేశారు.

**గురుపౌర్ణమికి ప్రత్యేక ఏర్పాట్లు**

ఓజిలి: గురుపౌర్ణమి సందర్భంగా మానమాల గ్రామంలోని బాబా మందిరం ముస్తాబయింది. గురువారం ఉదయం ఐదు గంటలకు కాగడా హారతి, ఆరు గంటలకు శ్రీసాయి జయజయసాయి నామం ప్రారంభం, పది గంటలకు రుద్రాభిషేకం, మధ్యాహ్నం తీర్థప్రసాదాలు, రాత్రి భజనలు, పల్లకీ సేవ భక్తులు హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఆలయాన్ని సుందరంగా రంగులతో తీర్చి, విద్యుత్ దీపాలతో అలంకరించారు.

**గురు పౌర్ణమికి ఆలయాలు ముస్తాబు**

రాపూరు: మండలంలోని పలు ఆలయాలు గురుపౌర్ణమి వేడుకలకు ముస్తాబయ్యాయి. రాపూరు, కండలేరులోని షిరిడీ సాయిబాబా మందిరం, వెంకయ్యస్వామి ఆలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### ప్రణాళికలు సిద్ధం చేయండి

రాపూరు: పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ భవాని సూచించారు. రాపూరు మండల ప్రజాపరిష్యత్ కార్యాలయంలో బుధవారం మండల అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు సచివాలయ ఉద్యోగులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### జెడ్పీటీసీ సభ్యుడి జన్మదిన వేడుకలు

కలువాయి(సైదాపురం) : కలువాయి మండల వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యులు అనీల్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు అభిమానుల మధ్య బుధవా రం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌లు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

### జానపద కళాకారుడికి పురస్కారం



చిల్లకూరు : జానపద కళలకు జీవం పోస్తూ సుమారు 200 అగ్నిగుండ ప్రవేశాలను చేపట్టిన పండరి భజన గురువు టీవీ క్రిష్ణదాసును గుర్తించి అంతర్జాతీయ జై ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ఉగాది పురస్కారంగా ఒక సర్టిఫికెట్‌ను పంపినట్లు ఎంపీడీఓ గోపి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆ సర్టిఫికెట్‌ను ఎంపీడీఓ చేతుల మీదుగా టీవీ క్రిష్ణదాసు అందుకున్నారు.

## తొలి అడుగులోనే టీడీపీ నేతల వాగ్వాదం

దొరవారిసత్రం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు'లోనే టీడీపీ నేతలు వాగ్వాదానికి దిగారు. మండలంలోని పోలెంపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన ఈ తొలి అడుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ హాజరయ్యారు. ప్రారంభంలోనే తమకు సమాచారం ఇవ్వకనే సమావేశాలు నిర్వహిస్తారా? అంటూ అధికార పార్టీ నేత సగిలాల రమణయ్య ప్రశ్నించారు. దీంతో మండల టీడీపీ అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులనాయుడు ఎదురుతిరిగారు. ఇద్దరి వాగ్వాదం మధ్య ఎమ్మెల్యే జోక్యం చేసుకున్నా ఎవరూ ఖాతర్ చేయలేదు. చివరికి కార్యక్రమం ముగించేశారు.



సమావేశంలో ఎమ్మెల్యే విజయశ్రీ సాక్షిగా కూటమి నేతల వాగ్వాదం